
स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत · उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

# సమ్మతం

అబ్బూరి ఛాయాదేవి



''మన ఇంట్లో ఎవరికీ లేదింత అల్లరి! ఎక్కణ్ణించి వచ్చిందే బాబూ వీడికి?'' అన్నాను మా అమ్మాయి ఇందిరతో, దాని కొడుకు అల్లరి భరించలేక.

''ఇంకెక్కణ్ణించి వస్తుంది! పిత్రార్జితం!'' అంది ఇందిర నవ్వుతూ.

''బాబోయ్! ఇప్పుడే వీడు కోపం వచ్చినప్పుడల్లా చేతుల్లో ఏదుంటే అది విసిరేస్తున్నాడు. రేప్పొద్దున్న బాంబులు విసురుతాడేమోనే!'' అన్నాను భయం నటిస్తూ. ఇందిర పకపకా నవ్వింది.

తను చేసిన ఘనకార్యాన్ని వాళ్ళమ్మ మెచ్చుకుంటోందనుకున్నాడో, నా భయం చూసి నన్ను బెదిరించడానికో, అప్పటినుంచీ కోపం వస్తే చాలు, ''ఇదుగో, బాంబు విసిరేత్తున్నా'' అనడం మొదలు పెట్టాడు. నేను భయపడి ''వద్దు బాబోయ్'' అనడం, వాడు చీటికీ మాటికీ బెదిరించడం ఆట అయిపోయింది వాడికి.

దీపావళి పండక్కి రమ్మని పిలిస్తే, కొడుకుని తీసుకుని ఢిల్లీ నుంచి వచ్చింది ఇందిర. పండగ కాదు గానీ, టపాకాయలూ, బాంబుల చప్పుళ్ళు వినలేకపోతున్నాం. ఎంత పెద్ద చప్పుడు చేస్తే అంత గొప్ప అనుకుంటున్నారు. ఇందిర కొడుక్కి ఇప్పుడు అది ఆట అయినా, ఈనాడు చుట్టూ పెరుగుతున్న హింసాత్మక వాతావరణం ప్రభావం వాడి పైన పడుతుందేమో అనే భయం పట్టుకుంది నాకు నిజంగానే. గతమంతా గుర్తుకొచ్చింది.

ఇందిర అప్పుడిక్కడ ఉస్మానియాలో ఎం. ఎ. పూర్తి చెయ్యగానే, ఏదో మంచి సంబంధం చూసి పెళ్ళి చేసేద్దాం అనుకున్నాం. కానీ అది ఎం.ఫిల్ చేస్తానని పట్టుపట్టింది. సరే, ఏదో సంబంధం కుదిరేవరకూ చేస్తుందిలే అని ఊరుకున్నాం. ఎం.ఫిల్. అయాక పి.హెచ్‌డి. అంది. అప్పుడు గట్టిగా అడ్డు చెప్పాం వాళ్ళ నాన్నా నేనూ. పి.హెచ్‌డి. అవడానికి

स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

ఎన్నేళ్ళు పడుతుందో, ఖర్చుసంగతి అటుంచి, ఆ డిగ్రీకి తగిన వాడు దొరకాలి కదా పెళ్ళికి. మేం ఎంతగా వాదించినా ఇందిర వినలేదు. దానికి తోడు, బంధుమిత్రులు సూచించిన ఏ సంబంధమూ ఏదో ఒక లోపంవల్ల కుదరలేదు. కట్నం తీసుకునే వాడిని నేను చేసుకోనని కచ్చితంగా ప్రకటించింది ఇందిర. ఈ వాదోపవాదాలు సాగుతూండగానే రీసెర్చి అసిస్టెంట్‌గా జె. ఎన్. టి.యులో ఉద్యోగం వచ్చింది. ఢిల్లీ వెళ్ళాక పి.హెచ్‌డి. కి కూడా రిజిస్టర్ చేయించుకుంది. మొదట్లో కొన్నాళ్ళు అక్కడ మా బంధువుల ఇంట్లో ఉంది. తరవాత ఒక స్నేహితురాలితో కలిసి వేరే గది తీసుకుని ఉంటోంది. మా దృష్టి అంతా దాని పెళ్ళిమీదే.

ముందు ఆడపిల్లకి పెళ్ళి చెయ్యకుండా మగపిల్లాడికి చెయ్యడం ఏమిటని, ఇందిర కన్న అయిదేళ్ళు పెద్దవాడైనా, మోహన్ మీద అంతగా ఒత్తిడి తీసుకురాలేదు. వాడు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా హాస్టన్‌లో ఉంటున్నాడు.

ఉన్నట్టుండి మాడు అదర గొట్టే కబురు చెప్పాడు. తను ఒక అమెరికన్ అమ్మాయిని పెళ్లి చేసుకున్నట్లు. ఫోన్ లో ఆ మాటలు వినగానే నిర్ఘాంత పోయి, ''అదేమిటిరా!'' అన్నాను.

''ఏమిటమ్మా, అంత ఆశ్చర్యబోతావ్! అక్కడి కొచ్చినప్పుడల్లా నువ్వేకదా పెళ్ళెప్పుడు చేసుకుంటావురా అని వెంటపడుతూండే దానివి'' అన్నాడు తేలిగ్గా.

''పెళ్ళి చేసుకోవడమంటే ఇదేరా పద్ధతి? నువ్వు నిశ్చయం చేసుకుని, పెళ్లి చేసేసుకున్నానని చెప్పెయ్యడమేనా!'' అన్నాను నిష్ఠూరంగా.

''నిశ్చయించుకోవల్సింది నేనేకదమ్మా, ఆ అమ్మాయితో కాపురం చెయ్యాల్సింది నేనే కదా!'' అన్నాడు నవ్వుతూ. అది చాలా తేలిగ్గా తీసుకోవలసిన విషయం అన్నట్లు.

''అంటే,పెద్ద వాళ్ళ ప్రమేయం ఏమీ ఉండక్కర్లేదన్నమాట. మన కుటుంబాల్లో పెళ్లిళ్ళు ఎలా అవుతూంటాయో నీకేమీ తెలియదన్నట్లు మాట్లాడుతున్నావ్!'' అన్నాను కొంచెం గట్టిగానే.


''తెలియకేమమ్మా, జాతకాలు చూడ్డం, కట్నాలూ కానుకలూ తీసుకోవడం, ఆర్భాటంగా ఖర్చులు చెయ్యడం, తరవాత గింజుకుంటూండటం అంతేగా!'' అన్నాడు వెటకారంగా.

నాకు ఒళ్లు మండింది. ''ముందుగా మీ నాన్నకి చెప్పావా?'' అని అడిగాను.

''లేడీస్ ఫస్ట్ అంటారుగా. ముందుగా నీకే చెప్పాలనుకున్నాను. నువ్వు నాన్నకి నచ్చజెప్పగలవని నాకు తెలుసు'' అంటూ నా ముందరి కాళ్ళకి బంధం వేశాడు.

ఆయనేమో అనవలసినవన్నీ నా దగ్గరే అంటారు. పిల్లల ముందు తను చెడ్డవాడనిపించుకోకూడదన్న గడుసుతనం. తన కిష్టం లేని పనులు పిల్లేవైనా చేసినప్పుడు, నేను పిల్లలకి స్వేచ్ఛనిచ్చి చెడగొడుతున్నానంటూ ఉంటారు. ఆయన ఇచ్చే చనువు సంగతి ఆలోచించుకోరు. వాళ్ళ నాన్నగారు ఆయన్ని చాలా కఠిన శిక్షణతో పెంచారుట. 'నాన్నగారూ' అని భయంభయంగా సంబోధించేవారుట. వాళ్ళమ్మగారు ప్రతిదానికీ, ''మీ నాన్నగారికి తెలిస్తే కోప్పడతారు'' అనో, ''మీ నాన్నగారికి కోపం వస్తుందనో భయపెట్టి, తను చెప్పిన మాట పిల్లలు వినేలాగ కట్టుదిట్టం చేసేవారుట. తల్లిని 'అమ్మా' అనీ, తండ్రిని 'నాన్నగారూ' అని పిలవడం ఏమిటని అనుకునేవారుట. అందుకే, తన కొడుకు చేత 'నాన్నా' అని పిలిపించుకునేవారు. వాడితో చనువుగా స్నేహితుడిలా మాట్లాడతారు. నిజం చెప్పాలంటే, నేను కూడా చిన్నప్పుడు నాకు లేదనిపించిన స్వేచ్ఛని నా పిల్లలకి కలుగ జేయడానికి ప్రయత్నించాను, అంతే.

ఇప్పుడు మోహన్ చేసిన పని తెలుసుకున్నాక ఆయన ఏమంటారో అన్న భయంతో నా గుండె బిగపెట్టినట్లయింది.




ఆయన ఇంటికొచ్చాక కాఫీతాగి స్థిమితపడ్డాక మెల్లిగా చెప్పాను మోహన్ ఫోన్ చేసిన సంగతీ, చెప్పిన సంగతీనూ. ఆయన నిర్ఘాంత పోయి కొంతసేపు మాట్లాడలేదు. నేను తలవంచుకున్నాను, ఆయన కళ్ళలోకి చూసే ధైర్యం లేక.

''వీళ్ళు అమెరికా వెళ్ళి చేసే ఘనకార్యం ఇదే!'' అన్నారు చివరికి, ఈనాటి తరాన్ని ఉద్దేశించి అన్నట్లు. ముందుగా తనకి ఫోన్ ఎందుకు చెయ్యలేదన్న ప్రశ్న లేవనెత్తలేదు. బతుకు జీవుడా అనుకున్నాను.

కానీ, తరవాత ఇందరి విషయంలో అలాగ అనుకోలేకపోయాను. ఇందిర హఠాత్తుగా బాంబు పేల్చినప్పుడు మా అమ్మ ఇంట్లోనే ఉంది. నన్ను చూసి చాలాకాలమైందనిపించిందంటూ, చూట్టానికి వచ్చింది విశాఖపట్నం నుంచి. నాన్నగారు పోయి అయిదేళ్ళు దాటింది. అన్నయ్య ఇంట్లోనే ఉంటోంది అప్పటినుంచీ. అసలే, మనవడు చేసిన ఘనకార్యం గురించి విని విస్తుబోతున్నది, మనవరాలు పేల్చిన బాంబుకి మూర్ఛపోయినంత పని చేసింది.

నాకు మతిపోయినట్లయింది. ఒంట్లో దడ పుట్టుకొచ్చింది.

स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत-उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

నా గురించికన్న, ఆయన ఏమంటారో అన్న భయమే నాకెప్పుడూ. అందులోనూ ఇది సామాన్య విషయం కాదు.

ఆ కుర్రాడు ముస్లింట. తన డిపార్ట్‌మెంటులోనే రీసెర్చి చేస్తున్నాడుట. అయిపో వచ్చిందిట. అతను ఫెలోషిప్ హోల్డర్‌ట. "వచ్చే ఆదివారం హైదరాబాదుకి వస్తున్నాం" అంది ఇంక వివరాలు అడిగే శక్తి మిగలనట్లయింది.

"ఏమిటే, మీ అన్నయ్యా నువ్వూ మమ్మల్ని ప్రశాంతంగా బతకనివ్వకూడదనుకున్నారా?" అన్నాను ఏడుపు గొంతుతో.

"కమాన్, ఛీరప్ మామ్! జావేద్‌ని చూస్తే నువ్వు ఆశ్చర్యబోతావ్. మన వాళ్ళబ్బాయే అనుకుంటావు. కావాలంటే మీరు దగ్గరుండి మన పద్ధతిలో మాకు పెళ్ళి జరిపించండి సింపుల్‌గా. ఇక్కడ రిజిస్టర్డ్ మేరేజ్ చేసుకున్నాం. ఆదివారం వస్తున్నాం. అమ్మా, బై" అంటూ మళ్ళీ మాట్లాడే అవకాశం ఇవ్వకుండా ఫోన్ పెట్టేసింది.

సంగతి తెలిశాక, "దీనికింత ధైర్యం ఎక్కణ్ణించి వచ్చిందే!" అంటూ పదేపదే గుండె మీద చేతులు వేసుకుంది అమ్మ. నాకు ఇంకా నమ్మబుద్ధికావడం లేదు.

ఆయన ఆఫీసులో ఉండగా ఇందిర సెల్‌లో మాట్లాడినట్లుంది. ఇంటికి వస్తూనే గంభీరంగా ముఖం పెట్టుకుని సరాసరి పడగ్గదిలోకి వెళ్లిపోయారు. వెంటనే వెనకాలే వెళ్ళి ఆయనతో మాట్లాడ్డానికి నాకు ధైర్యం చాల్లేదు. 'ఆదివారం' వాళ్ళిద్దరూ వస్తున్నారు, అనుకోగానే ఎవరో ఆటంకవాదులు ఇంటి మీదికి దాడికి వస్తున్నంత వెర్రి భయం వేసింది.

మెల్లిగా కాఫీ తీసుకుని గదిలోకి వెళ్ళాను. మంచం మీద కళ్ళు మూసుకుని పడుకుని ఉన్నారు. దగ్గరికి వెళ్ళి, "కాఫీ తీసుకోండి" అన్నాను. కళ్ళు తెరిచి నా వైపు వెర్రి చూపొకటి చూశారు. నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆయన లేచి కూర్చుని కాఫీ కప్పు అందుకున్నారు. నేను ఆయన పక్కనే కూర్చుని నడుంచుట్టూ చెయ్యి వేశాను. ఆయన నా భుజం మీద తలపెట్టుకున్నారు క్షణంసేపు నిస్సహాయంగా.

మేం భయసందేహాలతో ఎదురు చూస్తున్న రోజు రానే వచ్చింది. ముగ్గురం–అమ్మా, ఆయనా, నేనూ ఇంట్లోనే ఉన్నాం. డోర్ బెల్ వినిపించగానే మా అమ్మే లేచి వెళ్ళి తలుపు తీసింది.

ఎదురుగా ఇద్దరూ చిరునవ్వు ముఖాలతో కనిపించారు. అతని చేతిలో సూట్‌కేస్ ఉంది దానిచేతిలో హేండ్ బ్యాగ్ ఉంది అప్పుడే ఇద్దరి బట్టలూ ఒకే సూట్‌కేస్‌లోకి వచ్చేశాయి. ఇకమేం అసమ్మతి తెలిపే ఆస్కారమేలేదు. అయినా ఎటువంటి రభసా చేసి లాభం లేదని ముందే గ్రహించాం.

వాళ్ళిద్దరూ లోపలికి వచ్చి ముందుగా మా అమ్మ పాదాలకి నమస్కరించారు. అమ్మ సంప్రదాయ బద్ధంగా దీవించింది. తరవాత ఆయన పాదాలకీ, ఆ తరవాత నా పాదాలకీ నమస్కరించారు. వేరే క్షమాపణలు చెప్పుకునే అవసరం లేకుండా చేసుకున్నారు.

అతన్ని కూర్చోమన్నాను. ఆయన కూడా కూర్చుని, ఇంగ్లీషులో సంభాషణ ప్రారంభించారు. అమ్మ కూడా సావిట్లోనే ఓ మూల కుర్చీలో కూర్చుంది. నేను వంటింటి వైపుకి వెళ్ళాను. ఇందిర నా వెనకాలే వచ్చింది.

నేను దానితో మాట్లాడుతూంటే, "నేనిప్పుడే అలా వెళ్ళొస్తాను" అని ప్రసన్నంగానే చెప్పి బయటికి వెళ్ళారు ఆయన.

నేనూ ఇందిరా టిఫినూ కాఫీ పట్టుకుని సావిట్లోకి వెళ్లేసరికి అమ్మ ఆ అబ్బాయితో ముచ్చట్లాడుతోంది.

"ఇతను మనవాళ్ళలాగే చక్కని తెలుగు మాట్లాడుతున్నాడే అమ్మాయ్!" అంది నాతో సంబరంగా. ఇందిర ముసిముసిగా నవ్వింది.

"మా తాతగారి ఊరు రాజమండ్రి అండి. చిన్నప్పుడు సెలవులకి అక్కడికి అమ్మతో వెడుతూండేవాడిని. మాది అసలు కరీంనగర్. అందుకే నాకు తెలుగు బాగా వచ్చు" అన్నాడు.

"మీ తాతగారి ఊరు రాజమండ్రినా? రాజమండ్రి లో ఎక్కడుండేవారు? మీ తాతగారు ఏం చేసేవారు?" అని కుతూహలంగా అడిగింది అమ్మ.

"మా తాతగారు అడ్వకేట్ ఇస్మాయిల్‌గారు. ఆర్యాపురంలో ఉండేవారు" అన్నాడు.

"మీ అమ్మమ్మ పేరు సురయానా?" అని అడిగింది అమ్మ. ఆశ్చర్యంగా చూశాను అమ్మ వైపు.

"అవును. మీకు తెలుసా?" అని అడిగాడు జావేద్ కూడా ఆశ్చర్యబోతూ.

"బాగా తెలుసు. స్కూల్ ఫైనల్ వరకూ మేం కలిసి చదువుకున్నాం ఒకే హైస్కూల్లో. మా నాన్నగారు కూడా లాయర్. సురయా పెళ్ళికి నేనూ మా నాన్నగారూ వెళ్ళాం. వాళ్ళ నాన్నగారి దగ్గర జూనియర్‌గా పని చేస్తున్న అతనికే ఇచ్చి పెళ్ళిచేశారు. నాకు ఇంటర్ పూర్తయాక పెళ్ళయింది.

అమ్మ మాటలు విన్నాక జావేద్ పరాయివాడనిపించ లేదు. అప్పుడింక మత భేదాలు మమ్మల్ని భయపెట్టలేదు.

అయితే, ఇప్పుడు ఇందిర కొడుకుబుజ్జి అఫ్జర్‌గాడు బాంబు వేస్తానని చీటికీ మాటికీ భయపెడుతున్నాడు నన్ను!

